నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పరిచయ కార్యక్రమం

దుండిగల్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థితో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 9గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి లక్ష్మారెడ్డితో పాటు మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

పేట్‌బషీరాబాద్ డీఐగా నరసింహారాజు



కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహారాజు బాధ్యతలు చేపట్టారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేసిన ఆయన బదిలీపై రాగా ఇక్కడ పనిచేసిన రాజు ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. క్రైమ్ రేటు విషయంలో తప్పకుండా అప్రమత్తంగా ఉంటామన్నారు. దొంగతనాలు జరగకుండా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత సంక్షేమ సంఘాలపై ఉందని పేర్కొన్నారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు తమ సిబ్బంది నిఘా ఉంచుతూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

వైభవంగా కురుమారియమ్మ ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: చింతల్ డివిజన్ రోడామేస్త్రీ నగర్‌లో బుధవారం కురుమారియమ్మ దేవాలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక తమిళులకు కులదైవమైన కురుమారియమ్మ ప్రజలకు సుఖ సంతోషాలను ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బస్వరాజ్, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌రావు, అడ్వకేట్ కమలాకర్, వేణుయాదవ్, ఎత్తరి మారయ్య, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బయోలాజికల్ ఇండస్ట్రీస్ సందర్శన



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బయోలాజికల్ ఇండస్ట్రీస్‌ని బుధవారం నేషనల్ డిఫెన్స్ కాలేజీ ఆఫ్ మినిస్ట్రీ, డిఫెన్స్ కోర్స్ ఆన్ నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్‌కు చెందిన 16 మందితో కూడిన బృందం సభ్యులు సందర్శించారు. అనంతరం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలెక్టర్ గౌతమ్‌ను బృందం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలకడంతో పాటు కలెక్టరేట్ పరిపాలన విభాగం, భౌగోళిక పరిస్థితులు, పని విధానం తదితర అంశాలను ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలు, వాటి వివరాలను కూడా సభ్యులకు కలెక్టర్ తెలిపారు.

బీ కేర్‌ఫుల్..

సోషల్ మీడియాలో రాజకీయ అంశాలు.. వార్తల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికల వేళ.. ఎన్నికల సంఘం సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టింది. రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలనపై దృష్టి సారిస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. సంబంధిత అంశాల మేరకు అడ్మిన్‌కు నోటీసులు అందజేయడంతో పాటు క్రిమినల్ కేసుల నమోదుకు కూడా సిద్ధం అవుతున్నట్లు పేర్కొంటున్నారు. – సాక్షి, మేడ్చల్ జిల్లా



- నిబంధనలకు విరుద్ధమైన పోస్టులపై కఠిన చర్యలు
- అడ్మిన్‌కు నోటీసులు.. ఆ తర్వాత క్రిమినల్ కేసులు
- ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ నియామకం

◆ శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో నగర, పట్టణ, బస్తీ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువతీయువకులు అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం కొన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా టీమ్‌లు(వారియర్స్) కూడా నియమించి.. ప్రచారానికి అంత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల పోస్టులతో రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

◆ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాలో నమోదు చేస్తున్న ప్రచార కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని నియమించారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ-జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి యూ.అరుంధతి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఎం.వెంకటరమణ, కె.వెంకటేశ్వర్లును సభ్యులుగా నియమించారు. వీరు ప్రతిరోజూ వివిధ దిన పత్రికల్లో వచ్చే రాజకీయ అంశాలు, వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు..

సోషల్ మీడియాల్లో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిషన్‌పై, పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్ష విధిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్లు నమోదు చేసి కేసులు పెడతారని పేర్కొంటున్నారు.

'కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేది లేదు'

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'హస్తగత వ్యూహం'అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కొందరు నేతలు బీఆర్‌ఎస్ పార్టీలోనే తాము కొనసాగుతామని... ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారే ప్రసక్తే లేదని కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిలు వేర్వేలు ప్రకటనలో పేర్కొన్నారు. మల్కాజిగిరి టికెట్ ఆశిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సునీతరెడ్డి భర్త మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఇటీవల పలువురు కార్పొరేటర్లను కలుస్తూ మద్దతు కోరుతూ ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన ముగ్గురు కార్పొరేటర్లతో పాటు మరో 9 మంది పార్టీ మారుతున్నట్లు తెలిసింది. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండే రెండు సర్కిల్లో ఉన్న నలుగురు కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేది లేదని ప్రకటన విడుదల చేశారు. తాము బీఆర్‌ఎస్ పార్టీకి పనిచేస్తూ ఆ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని కార్పొరేటర్ రావుల శేషగిరి 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.

సాంకేతిక విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. లక్ష్మణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం స్పోర్ట్స్ డేను నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం రూ.1.50 కోట్లతో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని అన్నారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్విమ్మర్ శ్యామల గోలి, యోగ గురువు శ్రీకృపాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రేయారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలి



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహదేవపురం కాలనీవాసులు

సుభాష్‌నగర్: రానున్న వర్షాకాలం నాటికి డివిజన్‌లో మిగిలి ఉన్న సీసీ రోడ్లను పూర్తి చేస్తామని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ మహదేవపురం బ్లాక్-2లోని రోడ్ నం.2లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డును వెంటనే చేపట్టాలని బుధవారం స్థానికులు వినతి పత్రం సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించి కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్‌రెడ్డి, రంగారావు, సుబ్బారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎంకు కృతజ్ఞతలు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కమ్మ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ రేణుకా చౌదరి నేతృత్వంలో బుధవారం కమ్మ సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపి శాలువతో సత్కరించారు. లోక్‌సభ ఎన్నికల్లో సైతం కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు రవిశంకర్‌రావు, కుత్బుల్లాపూర్ సంఘం సెక్రటరీ బొబ్బా రంగారావు, వీరబాబు, దిలీప్ చౌదరి, శివరామప్రసాద్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లక్ష్మారెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం బిఆర్‌ఎస్ పార్టీ నేతలతో ఎన్నికల విషయంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు, వివేకానంద్ లు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. అదే విధంగా శంభీపూర్ రాజు, వివేకానంద్‌లను పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు కలిసి వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలదే..



కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పరితపించే ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించుకునే బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందని రాష్ట్ర నాయకుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జాతీయ నాయకుడు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్స్‌లో పెద్దబుద్దుల సతీష్ సగర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి అన్నదానం చేయగా కొంపల్లి, దూలపల్లి, దుండిగల్, గండిమైసమ్మ, సుచిత్ర, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదల మనిషి అయిన రాజేందర్ సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన సామాజిక స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, విగ్నేశ్వర్, శివాజీరాజు, వెంకట్‌రెడ్డి, భరతసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిమైసమ్మలోని పార్టీ కార్యాలయంలో..

దుండిగల్: బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గండిమైసమ్మలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నేతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు విఘ్నేష్ చారి, పీసరి కృష్ణారెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆకుల మల్లేశ్, ప్రభాకర్‌రెడ్డి, విజయ్, లక్ష్మణ్, మధు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

22న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ఈనెల 22 శుక్రవారం పంచలోహ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఉ. 9.45గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రతి సోమవారం 'ప్రజావాణి'

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రజావాణి కార్యక్రమం ఎంపీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



ఎండలు ముదరడంతో పేదవాడి ఫ్రిజ్‌లకు గిరాకీ పెరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల వద్ద వివిధ ఆకృతుల్లో కుండలు, కూజాల విక్రయాలు జోరందుకున్నాయి. లీటర్ సీసా మొదలుకుని 20 లీటర్లు వరకు నీళ్లు పట్టే సైజులో మట్టి కూజాలు అందుబాటులో ఉంచారు. హెచ్ ఎంటీ రోడ్డు, గండిమైసమ్మ, జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్, సూరారం, కొంపల్లి తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల వెంబడి విక్రయాలు చేపడుతున్నారు. లీటర్ సీసా కూజాను రూ.100, అదే విధంగా సైజును బట్టి 300 మొదలుకుని 500 వరకు కూజా కుండలను అమ్ముతున్నారు. –రంగారెడ్డినగర్

ఇంటింటికీ ఫామ్ 12డీ పంపిణీ చేయాలి

పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసేలా చర్యలు



బీఎల్‌ఓలకు ఫామ్ 12డీ ఫారాలను అందజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, 85 సంవత్సరాల దాటిన వృద్ధులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుద్యాస్ అధ్యక్షతన నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చేందుకు వీలుగా ఫామ్-12డీని ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని ఆదేశించారు. వివరాలు నమోదు చేసిన ఫామ్ 12డీని ఈ నెలాఖరు వరకు తిరిగి సేకరిస్తామని ప్రభుదాస్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 5798 మంది ఓటు హక్కు కలిగిన దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వారు 2059 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఐ కవిత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలి



మేయర్ నీలారెడ్డిని సత్కరిస్తున్న జీఎల్‌ఆర్‌కాలనీ నూతన కమిటీ సభ్యులు

నిజాంపేట్: కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని జీఎల్‌ఆర్ కాలనీ నూతన అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్ స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టి కాలనీలో మౌలిక వసతులు మెరుగుపరుస్తామన్నారు. కాలనీ ఉపాధ్యక్షులు కళ్యాణ్, శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బాపిరాజు, సంయుక్త కార్యదర్శి సురేష్‌రెడ్డి, కోశాధికారి సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్, శివ, ఆర్.కె. రాజు, జోగేశ్వరావు, కోటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మెడికల్ కాలేజ్ ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపండి

వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాలపై సంబంధిత శాఖ అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు ఆరా తీశారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై బుధవారం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై సమర్పించిన నివేదికపై అధికారులతో మాట్లాడారు. వైద్య కళాశాల, ఆరోగ్య సంరక్షణపై ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి సత్వరమే సమగ్ర ప్రతిపాదనలు పంపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను క్రిస్టినా చోంగ్తు ఆదేశించారు.

అల్వాల్ టిమ్స్ నిర్మాణ పనుల పర్యవేక్షణ

కలెక్టరేట్‌లో సమావేశం ముగిసిన తర్వాత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన ఆమె పనులను పరిశీలించారు. ఆస్పత్రి పనుల పురోగతిపై ఆరా తీయడంతో పాటు పనులు ఎంతవరకు పూర్తయ్యాయని, పెండింగ్ పనుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆస్పత్రి నిర్మాణ విషయాలు, పనుల పురోగతిని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సెక్రటరీ ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నోటరీ పత్రాలు ఉన్నా విద్యుత్ కనెక్షన్లు

కుత్బుల్లాపూర్: నోటరీ పత్రాలు ఉన్నా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు నిర్ణయించారు. వినియోగదారులకు కరెంటు కనెక్షన్ల జారీ సులభతరం చేసేందుకు, నోటరీ డాక్యుమెంట్లకు సైతం అదనపు డిపాజిట్ తీసుకొని గృహ కనెక్షన్లు జారీ చేస్తోంది. ఇప్పటి వరకు సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్ వంటి రిజిస్టర్ డాక్యుమెంట్ ఉంటేనే కనెక్షన్ ఇవ్వాలనే నిబంధన ఉండేది. కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తూ అక్రమాలకు తెరలేపుతున్న నేపథ్యంలో నోటరీ పత్రాలు ఉన్న కనెక్షన్లు ఇవ్వాలని డిస్కం నిర్ణయించింది. వినియోగదారులు ఆయా సెక్షన్ అధికారులను కలిసి పత్రాలు అందజేసి విద్యుత్ కనెక్షన్ పొందాలని సూచించారు.

టాయిలెట్ల వద్ద డంపింగ్



నందానగర్ నుంచి ఐడీపీఎల్ రోడ్డులో టాయిలెట్ల వద్ద చెత్త డంపింగ్ దృశ్యం

రంగారెడ్డినగర్: మూత్రశాల ముందు చెత్త డంప్ చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్ నుంచి ఐడీపీఎల్ ప్రధాన రోడ్డుకు వెళ్లే మార్గంలో ఎంటీఏఆర్ పరిశ్రమను ఆనుకుని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మూత్రశాలను ఏర్పాటు చేశారు. అయితే సదరు మూత్రశాల సమీపంలోనే చెత్త డంపింగ్ పాయింట్ ఉండటంతో దుర్గంధభరితంగా మారుతోంది. మూత్రశాలలోకి వెళ్లేందుకు వీలు లేకుండా చెత్త డంప్ చేస్తుండటంతో ఎవరూ వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సమీపంలో మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెత్త డంపింగ్ పాయింట్ నుంచి మూత్రశాలను మరోచోటకు మార్చి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక

రానున్న ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గరిసె నరేందర్ రాజు అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి నరేందర్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. – సుభాష్‌నగర్

